సాగునీరు ప్రశ్నార్థకం



అప్పలరాజుపేట వద్ద ప్రస్తుతం అడుగంటిన ఒట్టిగెడ్డ రిజర్వాయర్



గతేడాది జూలైలో కళకళలాడుతు కనిపించిన ఒట్టిగెడ్డ రిజర్వాయర్ (ఫైల్)

- మరమ్మతులకు నోచుకోని చెరువులు
- అక్కరకు రాని సాగునీటి వనరులు
- బీడువారుతున్న వేలాది ఎకరాలు
- ఆందోళనలో రైతులు
- పట్టించుకోని అధికారులు

రాజవొమ్మంగి: మండలంలోని సాగునీటి వనరులు దాదాపు అన్నీ మరమ్మతుకు గురయ్యాయి. తొలకరి సాగుకు వర్షాలే ఆధారం పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది మండలంలో తొలకరి వర్షాలు వెనుకడుగు వేశాయి. ఒకపక్క పాడైన నిరుపయోగంగా సాగునీటి వనరులు, మరో వైపు వర్షాభావ సరిస్థితులు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. కాగా జూన్ నెల సాధారణ వర్షపాతం 202.4 ఎంఎం కాగా ఆ నెలలో కేవలం 112.8 ఎంఎం మాత్రమే కర్షం కురిసింది. జూలై నెల వర్షపాతం 308 ఎంఎం కాగా ఈ నెలలో 13 రోజుల్లో కేవలం 67 ఎంఎం మాత్రమే వర్షం కురిసినట్టు అధికారులు చెపుతున్నారు. రాజవొమ్మంగి మండలంలో సుమారు 6,500 ఎకరాల్లో వరి సాగవుతుండగా ఆ భూమి అంతా ప్రస్తుతం వర్షాలపైనే ఆధారపడిందంటున్నారు. రానున్న రోజుల్లో వర్షాలు పడకపోతే పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన చెదరుమదురు వానలకు రైతులు దుక్కులు దున్ని నారు మడులు తయారు చేసి విత్తనాలు వెదజల్లారు. కాగా నారు ఎదిగి, నాట్లు వేసే సమయానికి వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు.

వృథాగా సాగునీరు

మండలంలో మొత్తం 68 చిన్న పెద్ద సాగునీటి చెరువులు, చెక్‌డ్యాంలు ఉన్నాయి. వీటిలో 11 పెద్దవి. మేజర్ సాగునీటి వనరులు అన్ని దాదాపు పాడై ఉన్నాయి. దీనితో ఆయా సాగునీటి వనరులు నీటి నిల్వ సామర్థ్యం కోల్పోడంతో రైతులు వర్షాధారం పైనే ఆధారపడుతున్నారు. మండలంలోని అప్పలరాజుపేట వద్ద గల వట్టిగెడ్డ రిజర్వాయర్ షట్టర్ (స్లూయిజ్‌కు గల తలుపు) తుప్పు పట్టి రంధ్రాలు పడ్డాయి. మరోవైపు తలుపు కింద ఉండే రబ్బర్ బూట్ వరద ఉధృతికి దిగువకు కొట్టుకుపోయింది. దీంతో రిజర్వాయర్‌లోకి ఏ మాత్రం వర్షపు నీరు చేరినా ఈ షట్టరుకు గల రంధ్రాలు, ఖాళీల ద్వారా చెరువు గర్భంలోని విలువైన సాగునీరు వృథాగా అడ్డు అదుపులేకుండా దిగువకు పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ తలుపుకు రిపేరు చేయాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా పెడచెవిన పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. వట్టిగెడ్డ రిజర్వాయర్ ద్వారా మండలంలోని ఐదు గ్రామాల్లోని దాదాపు 3వేల ఎకరాల ఆయకట్టు భూములను సాగునీరు అందుతోంది. రిజర్వాయర్‌లో నీరు ఉంటేనే పరిసర ప్రాంతాల్లో వరి నాట్లు పడతాయి. కాగా ఇప్పుడు ఈ రిజర్వాయర్ వర్షాలు లేక, మరో వైపు రిపేర్లకు నోచుకోక పూర్తిగా అడుగంటింది. దీంతో ఖరీఫ్ వరి సాగు ప్రశ్నార్థకంగా మారిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు 200 ఎకరాల చెరువు గర్భం(క్యాచ్‌మెంట్ ఏరియా) గల ఈ రిజర్వాయర్ ఏ మాత్రం వర్షం వచ్చినా ఇట్టే నిండి రైతులకు ఏడాది పొడవునా సాగునీరు, పశువులకు తాగునీరు అందిస్తోంది. అంతటి ప్రాధాన్యత గల ఈ రిజర్వాయర్ షట్టర్‌కు పడిన రంధ్రాల ద్వారా ఎప్పటి నీరు ఎప్పటికప్పుడే దిగువకు పోతుండడం వల్ల రిజర్వాయర్ నిండడం లేదని రైతులు చెబుతున్నారు. దీంతో సాగునీరందక పొలాలు బీడుగా మారుతున్నాయని వాపోతున్నారు. ఈ రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టం 16 అడుగులు కాగా ప్రస్తుతం రెండు అడుగులకు మించి నీరు లేదు. దీంతో ప్రస్తుతం రిజర్వాయర్‌లో గల నీరు పంట కాలానికి సరిపోదని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని వాతంగిలోని బాతులబంద, అనంతగిరి చెరువు, అమ్మిరేఖల, ఉర్లాకులపాడు, సింగంపల్లి, గింజర్తి రిజర్వాయర్లు మరమ్మత్తులకు గురై ఆయకట్టు భూములకు పూర్తిస్థాయిలో సాగునీటిని అందించలేకపోతున్నాయి. ఇకనైనా ఆయా సాగునీటి వనరులకు తాత్కాలిక మరమ్మత్తులు అయినా చేపడితే వరి సాగుకు డోకా వుండదని రైతులు అంటున్నారు. సంభందిత స్పెషల్ మైనర్ ఇరిగేషన్, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి

మండలంలో దాదాపు 11 సాగునీటి చెరువులు మరమ్మతుకు నోచుకోక దిగువన గల ఆయకట్టు భూములకు నీటిని అందిచలేకపోతున్నాయి. దీనితో రేపో మాపో వర్షాలు పడకపోతాయానని ఎదురుచూస్తున్నాం. ఇప్పటకైనా అధికారులు స్పందించి పాడైన సాగునీటి వనరులకు మరమ్మతు చేసి, సాగునీరు వృథా కాకుండా చూడాలి.

– సోములు, రైతు, అప్పలరాజుపేట, రాజవొమ్మంగి

క్లుప్తంగా

తహసీల్దార్‌గా త్రివేణి బాధ్యతల స్వీకరణ



డుంబ్రిగుడ: మండలంలోని నూతన తహసీల్దార్‌గా త్రివేణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చీడికాడ మండలంలో తహసీల్దార్‌గా పనిచేసి బదిలీపై డుంబ్రిగుడ వచ్చారు. ఇక్కడ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పనిచేసిన ముజీబ్ అనకాపల్లి జిల్లా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ త్రివేణి మాట్లాడుతూ గతంలో గిరిజనులకు మెరుగైన సేవలు అందించి భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సిబ్బంది ఆమెను మార్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. ఆర్ఐ రాము, సీనియర్ అసిస్టెంట్ కోటేశ్వరరావు తదితరులున్నారు.

వారపు సంతలో తనిఖీలు



సంతలో తనిఖీలు అనంతరం ట్రైనీ ఎస్‌ఐలకు సూచనలిస్తున్న సీఐ నరసింహమూర్తి

వై.రామవరం: ట్రైనీ ఎస్‌ఐలకు శిక్షణలో భాగంగా వై.రామవరం వారపు సంతలో అడ్డతీగల సీఐ బి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో సోమవారం తనిఖీలు నిర్వహించారు. గంజాయి అక్రమ రవాణా, మావోయిస్టుల కదలికలు ఉన్నట్టు అందిన సమాచారం మేరకు విస్తృతంగా తనిఖీలు చేశారు. ట్రైనీ ఎస్‌ఐలకు తనిఖీలు నిర్వహించే విధానంపై శిక్షణ ఇచ్చారు. వారపు సంతలో అమ్ముతున్న నిత్యావసర వస్తువులను పరిశీలించారు. అనుమానితులు, అపరిచితులపై గట్టి నిఘా విధించారు. ఎస్ఐ బి.రామకృష్ణ, అడ్డతీగల, రాజవొమ్మంగి, జడ్డంగి, వై.రామవరం పోలీసు స్టేషన్‌లకు చెందిన ట్రైనీ ఎస్‌ఐలు కె.కరుణ, జె.కల్పన,బి.అంజని, జి.నానినరేందర్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలకు ఆధార్ నమోదు తప్పనిసరి



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి: ఐదేళ్ల లోపు పిల్లలకు విధిగా తల్లిదండ్రులతో కలిసి ఆధార్ చేయించాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు ఆదేశించారు. ఆయన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సాల లోపు పిల్లలకు బాల ఆధార్ తీయించాలని కోరారు. తల్లికి వందనంకు సంబంధించి ఈకేవైసీని పూర్తి చేయాలని సూచించారు. సంక్షేమ సహాయకులు విధిగా పాఠశాలలను సందర్శించి వివరాలు తెలుసుకోవాలన్నారు. పలు అంశాలపై పంచాయతీ కార్యదర్శులకు సలహాలు, సూచనలిచ్చారు.


ఆత్మీయ సన్మానం



ఏపీఎం రామాంజనేయులను సన్మానిస్తున్న వెలుగు మహిళలు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయం నుంచి వివిధ మండలాలకు బదిలీపై వెళుతున్న ఏపీఎం, సీసీలను మండల మహిళా సమాఖ్య నాయకులు, సహచర ఉద్యోగులు సోమవారం ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. బదిలీపై వెళ్తున్న వారిలో ఏపీఎం రామాంజనేయులు, సీసీలు సుధాకర్, లక్ష్మీనారాయణ, సత్యనారాయణ ఉన్నారు. వీరిని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పప్పుల బాలమ్మ తదితరులు పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సన్మానించారు. ఏపీడీ దేగలయ్య, స్త్రీనిధి మేనేజర్ కృష్ణ, ఎల్.సి. అప్పారావు, ఏపీఎం నీలి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన దారితో అవస్థలు



కొత్తపాలెం-జోడూరు రోడ్డు దుస్థితి

పాడేరు రూరల్: మండలంలోని వంట్లమామిడి పంచాయతీ కొత్తపాలెం, జోడూరు రోడ్డు అధ్వానంగా ఉందని స్థానికులు సత్తిబాబు, భాస్కర్, రాజులు చెబుతున్నారు. వారు సోమవారం విలేకరులతో మాట్లాడుతూ రాళ్లు తేలి, పెద్ద పెద్ద గోతులతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో గోతుల్లో నీరు చేరి వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దారుణ రహదారి వల్ల ఈ మార్గంలోని పలు గ్రామాలకు 108,104 అంబులెన్స్ సేవలు అందని పరిస్థితి ఉంది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి రహదారి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

సేంద్రియ సాగుతో అధిక దిగుబడులు



గిరిజన రైతులకు పనిముట్లు అందజేస్తున్న ఎంపీపీ ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ

డుంబ్రిగుడ: సేంద్రియ వ్యవసాయం ఎంతో మేలని ఎంపీపీ బాకా ఈశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సెంటర్ ఫర్ పిపుల్స్ పేరేంట్రి (సీపీఎఫ్) సంస్థ ప్రొగ్రాం ఆధికారి ఆచార్య నాగమణి ఆధ్వర్యంలో పనిముట్లును రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మలు మాట్లాడుతూ మండలంలోని తూటంగి, గుంటగన్నేల, లైగండ పంచాయతీ 20 గిరిజన రైతులను ఎంపిక చేసుకోని వ్యవసాయ పనిముట్లు ప్యాన్, గడితీత, గడికోత, తూకం తదితర ఐదు పనిముట్లు చొప్పున 20 యూనిట్‌లు అందజేశారు. స్వచ్ఛంద సంస్థల ద్వారా రైతులకు ఇటువంటి పనిముట్లు అందివ్వడం రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, సీపీఎఫ్ సంస్థ కో–ఆర్డినేటర్ కమల, మూడు పంచాయతీల గిరిజన రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎటపాక: మండలంలోని నెల్లిపాక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 16 గ్రామాలకు మంగళవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఏఈ సూరిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులు చేపడుతుండడంతో తోటపల్లి నుంచి మురుమూరు, లక్ష్మీపురం, విస్సాపురం, చోడవరం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఏఈ కోరారు.

అబద్ధాల కూటమి ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

డుంబ్రిగుడ: రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలన సాగుతుందని, అబద్ధాల కూటమి ప్రభుత్వానికి బ్రాండ్ అంబాసిడర్‌గా చంద్రబాబు వ్యవహరిస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పాంగి పరశురామ్, వైస్ ఎంపీపీ శెట్టి ఆనంద్ అన్నారు. మండల కేంద్రంలో పార్టీ శ్రేణులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీని కూటమి ప్రభుత్వం నేరవేర్చలేదని తల్లికి వందనం ఒక సంవత్సరం విస్మరించి, రెండో ఏడాది అరకొరగా చాలా కొద్దిమందికి మాత్రమే జమచేసి చేతులు దులుపుకున్నారన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ దాటిపోతున్నా రైతులకు అన్నదాత సుఖీభవ ఇవ్వలేదని, ఇంకెప్పుడు ఇస్తారో చంద్రబాబుకే తెలియాలన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఏటేటా అమ్మఒడి, రైతు భరోసాతో పాటు అనేక సంక్షేమ పథకాలు సమయానికి అనుకున్న గడువులోగా జమ చేశారని గుర్తు చేశారు. నాడు జగనన్న పాలన దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అరాచక పాలనతో రాష్ట్ర ప్రజలు విసుగెత్తిపోతున్నారన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నేరవేర్చలని వారు డిమాండ్ చేశారు. పోతంగి, గుంటసీమ సర్పంచ్‌లు వెంకటరావు, గుమ్మ నాగేశ్వరరావు, వైస్ సర్పంచ్ జగ్గునాయుడు, వార్డు సభ్యుడు లచ్చన్న, మండల పార్టీ కార్యదర్శి మఠం శంకర్, కార్యకర్తలు విజయదశమి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్షయపై అవగాహన అవసరం



అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సీహెచ్‌సీ వైద్య సిబ్బంది

అడ్డతీగల: జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో సూపరింటెండెంట్ పండా సతీష్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధిపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. వారం రోజులకు మించి దగ్గు వస్తుంటే ఆస్పత్రికి వచ్చి వైద్యం పొందాలని సూచించారు. 100 రోజులు క్యాంపెయిన లో ఆస్పత్రుల వద్ద, గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆసుపత్రులకు వచ్చే రోగులు ముందుగా కళ్లె పరీక్షలు చేయించుకుంటే పాజిటివ్ రిపోర్ట్ వచ్చినట్లు అయితే మందులు అందజేస్తామన్నారు. క్షయ వ్యాధి సంక్రమణ, నివారణ గురించి ఆస్పత్రి కౌన్సిలర్ నార్నె వాసు వివరించారు. ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అడ్డతీగల టీబీ యూనిట్ ఎస్.టి.ఎస్.జి.లక్ష్మి, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణపై హైకోర్టు ఉత్తర్వులు అమలుచేయాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎంపీపీ వరహాలమ్మ, నాయకులు

పెదబయలు: మండల కేంద్రంలో ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా అక్రమంగా నిర్మాణం చేసు కుని ఉన్న అక్రమ కట్టడాలు హైకోర్టు ఆదేశాల మేరకు వెంటనే తొలగించాలని తహసీల్దార్ కార్యా లయం ఎదుట ఎంపీపీ బొండా వరహాలమ్మ, సర్పంచ్ పలాసి మాధవరావు, ఎంపీటీసీ సభ్యుడు కిమంకరి బొంజుబాబు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టు కుని రోడ్డు విస్తరణ చేపట్టాలని కోర్టు ఆదేశాల జారీ చేసినా ఎందుకు అక్రమ కట్టడాలు తొలగించడం లేదన్నారు. మండలంలో మన్యంలోనే పెద్ద వారపు సంత అవుతుందని సంతకు ఆంధ్ర –ఒడిశా నుంచి పెద్ద ఎత్తున వాహనాలు వస్తున్నాయన్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందన్నారు. కోర్టు ఆదేశాల మేరకు రోడ్డు కిరువైపులా 100 అడుగుల వెడల్పు చేయాలని ఆదేశాల ఉన్న అధికారులు ఎందుకు స్పందించడం లేదన్నారు. గత నెల 14న గ్రామ పంచాయతీ పీసా కమిటీ తీర్మానించి అల్లూరి కలెక్టర్ దినేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేసిన ఏ మాత్రం స్పందన లేదన్నారు. రోడ్డు విస్తరణ చేపట్టాలని నినాదాలు చేశారు. సీపీఎం మండల అధ్యక్షుడు బొండా సన్నిబాబు, బొండాపల్లి సర్పంచ్ మత్స్యరాజు, వైస్ సర్పంచ్ బొండా గంగాధరం, వార్డు సభ్యులు వెంకటరావు, నీలకంఠం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ శ్రమదానం



సుజనపేటలో కుంగిన కల్వర్టు వద్ద శ్రమదానం చేస్తున్న సర్పంచ్ రమేష్

ముంచంగిపుట్టు: మండలంలోని సుజనకోట పంచాయతీ సుజనపేట గ్రామానికి వెళ్లే ఆర్అండ్‌బీ మార్గంలో కల్వర్టు ఒకవైపు కుంగిపోయి ఏడాదవుతుంది.గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు కల్వర్టు పూర్తిగా కుంగిపోతూ ,రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు ఆర్అండ్‌బీ అధికారులకు సమస్యను అనేకమార్లు విన్నవించినా స్పందన కరువైంది. వాహనచోదకులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు గ్రహించిన సుజనకోట సర్పంచ్ వెంగడ రమేష్ కుంగిన కల్వర్టు వద్ద రాకపోకలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకున్నారు. సోమవారం స్వచ్ఛందంగా గంట పాటు శ్రమదానం చేశారు. కల్వర్టుకు ఒకవైపు రాళ్లను పేర్చి, వాహన రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశారు.సర్పంచ్ చొరవపై వాహనచోదకులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కల్వర్టు బాగు చేసి, రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సర్పంచ్ రమేష్‌తో పాటు వాహనదారులు కోరుతున్నారు.

అన్నపూర్ణేశ్వరి సేవలు అభినందనీయం



అన్నపూర్ణేశ్వరిని సన్మానిస్తున్న ఏజెన్సీ డీఈవో, ఎంఈవో–2 టి.మల్లేశ్వరరావు, యూటీఎఫ్ నాయకులు

గంగవరం : మండలంలోని ఉమ్మెత్త గిరిజన ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పని చేస్తూ ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన అన్నపూర్ణేశ్వరి పదవీ విరమణ సన్మాన కార్యక్రమాన్ని యూటీఎఫ్ మండలశాఖ ఆధ్వర్యంలో స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏజన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు మాట్లాడుతూ గిరిజన ఉపాధ్యాయురాలు సీహెచ్.అన్నపూర్ణేశ్వరి 37 ఏళ్లుగా విద్యారంగానికి అందించిన సేవలు అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా అన్నపూర్ణేశ్వరి , బంగార్రాజు దంపతులను పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించి , సన్మాన పత్రాన్ని, జ్ఞాపికలను బహుకరించారు. ఈ కార్యక్రమానికి యూటీఎఫ్ మండలశాఖ అధ్యక్షుడు రాంబాబు అధ్యక్షత వహించగా, డీఈఈ (అమరావతి) రోలుపల్లి గోపాలకృష్టారెడ్డి, విశ్రాంత డీఎస్పీ కాకూరి బాలరాజు, ఎంఈవో–2 టి.మల్లేశ్వరరావు, పిహెచ్‌సీ వైద్యాధికారి భావన , ఆదివాసి గిరిజన సంక్షేమ సంస్కృతిక సంఘం జిల్లా అధ్యక్షులు కె.ఆదిరెడ్డి, జిల్లా కార్యదర్శి కె.కృష్ణ, స్థానిక ఆశ్రమపాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీరాములు, సీనియర్ ఉపాధ్యాయులు కెఎల్‌వి ప్రసాద్, తదితరులు ప్రసంగిస్తూ ఉపాధ్యాయ వృత్తిలో ఎంతో అంకితభావరం, సేవాభావం కలిగిన అన్నపూర్ణేశ్వరి సేవలను కొనియాడారు. వెంకటేశ్వరరావు, రుక్మిణి దేవి, బొజ్జి దొర , వెంకన్న దొర, విజయలక్ష్మి, కె.లక్ష్మి, భవాని తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల నిర్మించాలని ఆందోళన



పాఠశాల భవనం నిర్మించాలని ధర్నా చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు

రాజవొమ్మంగి: చికిలింత పంచాయతీ కరుదేవపాలెం గ్రామంలో శిథిలావస్థకు చేరుకుంది.ఈ పాఠశాల భవనాన్ని తొలగించి కొత్త భవనం నిర్మించాలంటూ గ్రామస్తులు సోమవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆందోళ చేపట్టారు. గిరిజన సంఘం కార్యదర్శి కోండ్ల సూరిబాబు ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం జరిగింది. ఈ పాఠశాలలో ఒకటవ తరగతి నుంచి 5వ తరగతి వరకు 35 మంది విద్యార్థులు చదువుతున్నట్టు చెప్పారు. గ్రామంలో దశాబ్దాల క్రితం నిర్మించిన పాఠశాల భవనం పూర్తిగా శిథిలస్థితికి చేరుకొని కూలిపోయే ప్రమాదకర పరిస్థితిలో ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూడమి ప్రభుత్వం ఈ గ్రామంలోని పాఠశాల దుస్థితిని పట్టించుకోడం లేదని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆరోపించారు. ఇప్పటికైనా యంత్రాంగం స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరారు.

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం



ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు

అడ్డతీగల: రాజీకి వీలైన కేసులు మధ్యవర్తిత్వంతో పరిష్కరించుకోవాలని అడ్డతీగల జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టు న్యాయమూర్తి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం.మురళీ గంగాధర రావు అన్నారు. మీడియేషన్ ఫర్ ద నేషన్ పేరిట మధ్యవర్తిత్వంతో కేసులను రాజీ చేసుకోవడం వల్ల కలిగే ఉపయోగాలను వివరిస్తూ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు అడ్డతీగలలో వారం రోజుల అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అడ్డతీగలలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇరుపక్షాలు అంతరాలను తొలగించుకోవచ్చన్నారు. రాజీ అనేది తక్కువ ఖర్చుతో కూడుకున్నదన్నారు. సామరస్య పరిష్కారానికి మార్గమన్నారు.గోప్యతకు ఆస్కారం ఉంటుందన్నారు. అత్యంత అనుకూలమైనదన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాఫీ రైతులకు సొమ్ములు చెల్లించాలని డిమాండ్



రైతులతో కలిసి ఆందోళన చేస్తున్న ఎంపీటీసీ సభ్యుడు బుజ్జిబాబు

గూడెంకొత్తవీధి: గూడెం పంచాయతీలో గిరిజనుల నుంచి కొనుగోలు చేసిన కాఫీ పిక్కల డబ్బులను వెంటనే వారి ఖాతాల్లో వేయాలని గాలికొండ ఎంపీటీసీ సభ్యుడు అంపురంగి బుజ్జిబాబు సోమవారం రైతులతో కలిసి ఆందోళన చేశారు. నెలలు గడుస్తున్నా ఇంత వరకు చెల్లింపులు చేయక పోవడం దారుణమన్నారు. దీనిపై కలెక్టర్ దినేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని వాపోయారు. రైతులు అప్పులు చేసి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.


పాఠశాలను తరలించొద్దని వినతి



అధికారులకు వినతిపత్రం ఇస్తున్న తల్లిదండ్రులు

రాజవొమ్మంగి: మండలంలోని వంచంగి పంచాయతీ జి.కొత్తపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు (జీపీఎస్) చెందిన పిల్లలను వేరే పాఠశాలకు తరలించే ప్రయత్నంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పాఠశాలలో ఒకటవ తరగతి నుంచి ఐదు వరకు 30 మంది చదువుతున్నారని, వీరిలో 3,4,5 తరగతులకు చెందిన విద్యార్థులను సుదూరంగా వాతంగిలో గల ఆశ్రమ పాఠశాలలో చేర్పించాలంటూ ఇప్పటికే టీసీలు ఇచ్చేశారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ చర్యలను వారంతా వ్యతిరేకించారు. ఈ మేరకు రాజవొమ్మంగికి వచ్చి ఎంపీడీవో యాదగిరీశ్వరరావు, ఎంఈవో–1 సత్యనారాయణ దొర, ఎంఈవో–2 సూరయ్యరెడ్డిలకు ఆయా గ్రామస్తులు వినతిపత్రాలు ఇచ్చారు. మా పిల్లలు మా ఊర్లో గల జీపీఎస్ పాఠశాలలోనే చదువుకొనేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వినతిలో పేర్కొన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు శ్రీనివాస్, సీపీఎం నేత దుర్గాదేవి, చిన్నారుల తల్లిదండ్రులు, లోవకుమారి, రమణమ్మ, వరలక్ష్మి, రెడ్డి, అచ్చిరాజు, వెంకటగిరి, దుర్గబాబు, గైరమ్మ పాల్గొన్నారు.

పచ్చిమేతతో పశువులకు ఆరోగ్యం



పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ చిట్టినాయుడు

మాడుగుల : పాడి రైతులు పశుగ్రాసం పెంపకంపై అవగాహన పెంచుకోవాలని ఏరియా పశువైశ్యశాల సహాయ సంచాలకుడు వి.చిట్టినాయుడు అన్నారు. సోమవారం పశుగ్రాస వారోత్సవాలులో బాగంగా స్థానిక మరిడిమాంబకాలనీలో పాడి రైతులతో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. పాడి పశువులకు పచ్చి మేత మేపడం వల్ల పశువులు ఆరోగ్యంగా ఉండడంతో పాటు పశువుల్లో పునరుత్పత్తి పెరుగుతుందన్నారు. ప్రస్తుతం పశువైద్యశాలలో 75 శాతం రాయితీతో అందుబాటులో కాకిజొన్న పశుగ్రాస విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. 5 కిలోల విత్తనాలు రూ 460 కాగా రాయితీ రూ.345 పోను రైతు రూ.115 చెల్లించాలన్నారు. సంకర జాతి, ఆవులు, గేదెలకు అధిక పాలదిగుబడి రావాలంటే పచ్చి మేత ఎంతైనా అవసరమన్నారు. పొలాల చుట్టూ సుబాబుల్, అవిసె చెట్లు పెంచడం వల్ల వేసవిలో పశువులకు మేత కొరత ఉండదన్నారు. రైతులు పశుగ్రాస పెంపకంలో మెలకువలు తెలుసుకుంటే అధిక లాభాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారులు, పాడి రైతులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాడేరు డివిజన్:
9010973030, 9010234557
Office mail : sakshiadvtvsp@gmail.com